క్లుప్తంగా

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

డాబాగార్డెన్స్: వర్షాకాలం దృష్ట్యా వార్డుల్లో మెరుగైన పారిశుధ్య నిర్వహణకు ముందస్తు చర్యలు చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ సాయి కాంత్ వర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. మురుగునీరు, వర్షపు నీరు సాఫీగా పోయేలా ప్రధాన గెడ్డల్లో వ్యర్థాలు తొలగించాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురికాకుండా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. కాలువల్లో వ్యర్థాలు వేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ప్రతి జోన్ పరిధిలో లోతట్టు ప్రాంతాలు గుర్తించి, అక్కడి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. అండర్ బ్రిడ్జిల ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు మోటార్ల సహాయంతో తొలగించాలని ఆదేశించారు.

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే వాసుపల్లి


అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారిని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ గురువారం దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యేచే అమ్మవారికి విశేష పూజలు చేయించారు. వేద ఆశీర్వచనం అనంతరం అమ్మవారి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు ధనలత, సుబ్రహ్మణ్యం, కార్యనిర్వాహక ఇంజనీరు సీహెచ్‌వీ రమణ, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి అమ్మవారికి వెండి కిరీటం బహూకరణ


కిరీటం అందజేస్తున్న దాతలు

డాబాగార్డెన్స్: సిరులతల్లి కనకమహాలక్ష్మికి శ్రీకాకుళం జిల్లాకు చెందిన వి.రమ్య కుటుంబ సభ్యులు 262 గ్రాముల వెండి కిరీటం బహూకరించారు. వెండి కిరీటాన్ని ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలానికి అందజేశారు. కార్యక్రమంలో ధర్మకర్త ఎన్ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, కార్యనిర్వాహక ఇంజనీరు సీహెచ్‌వీ రమణ, ఆలయ పర్యవేక్షకులు పాల్గొన్నారు.

ఉద్యోగాల భర్తీకి డిమాండ్


కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

మహారాణిపేట: ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు భర్తీ చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జిల్లా సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరిపల్లి రాంబాబు, అధ్యక్షుడు కె.అచ్యుత్ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. పశుసంవర్ధక శాఖలో ఏహెచ్ఏ పోస్టులు భర్తీ చేయాలని, మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసి 55 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని, గ్రూప్ – 2 పోస్టులు పెంచి నోటిఫికేషన్ ఇవ్వాలని, ఎస్.ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు ప్రిలిమ్స్‌లో అర్హత పొందిన అభ్యర్థులకు ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించాలని నినాదాలు చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

వరప్రసాద్ సేవలు మరువలేనివి

సీతంపేట: ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్‌గా డాక్టర్ కడలి సత్యవరప్రసాద్ అందించిన సేవలు మరువలేనివని శెట్టిబలిజ సంక్షేమ సంఘం పెద్దలు కొనియాడారు. ఇటీవల పదవీ విరమణ చేసిన వరప్రసాద్‌ను నగరంలోని ఆయన ఇంటి వద్ద గురువారం శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఘనంగా సత్కరించింది.

ఓల్డ్ సిటీ..న్యూ లుక్

- సీఎం జగన్ పాలనా దక్షతతో అభివృద్ధి వైపు అడుగులు..
- కనీస సదుపాయాలు, పాఠశాలలు, కల్యాణ మండపాలు, కమ్యూనిటీ భవనాలు, పథకాలతో ప్రజలకు అందుతున్న భరోసా
- వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనతో పాతనగరానికి కొత్త సొబగులు

అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండే పాతనగరం ఇప్పుడు కొత్త రూపు సంతరించుకుంటోంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమం, చేస్తున్న అభివృద్ధితో మిగతా అన్ని ప్రాంతాలతో పాటు పాతనగరం కూడా తన తీరుతెన్నులు మార్చుకుంటోంది. కనీస సదుపాయాలు, పాఠశాలలు, కల్యాణ మండపాలు, కమ్యూనిటీ భవనాలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. జగనన్న పథకాలు స్థానికులకు భరోసా కల్పిస్తున్నాయి.


జీవీఎంసీ 39 వార్డులో నాడు-నేడు కింద అభివృద్ధి చేసిన ఎంవీడీఎం పాఠశాల


కోటవీధి వద్ద జరుగుతున్న కాలువ నిర్మాణం


మరమ్మతులతో కొత్త వైభవం సంతరించుకున్న ముస్లిం షాదీఖానా

జగదాంబ : ఒకప్పుడు విశాఖ అంటే ఇప్పుడు పాతనగరంగా మనం చెప్పుకునే వన్‌టౌన్, పాత పోస్టాఫీసు తదితర ప్రాంతాలు. వెనుకటి రోజుల్లో టౌన్‌గా ప్రసిద్ధి చెందిన ఈ ప్రాంతం గత పాలకుల కాలంలో నిర్లక్ష్యానికి గురయింది. ఇక్కడి ప్రజలను వారు కేవలం ఓటర్లుగానే చూసేవారు. ఎలాంటి అభివృద్ధికి నోచుకోని పాతనగరంలో రోడ్లు, డ్రైయిన్లు, మంచినీటి కుళాయిలు, చేతిబోర్లు, విద్యుత్ వంటి సౌకర్యాలు గతంలో అంతంతమాత్రంగానే ఉండేవి. సమస్యలు ఉత్పన్నమైతే వాటి పరిష్కారానికి సుదీర్ఘ కాలం పట్టేది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో..

కనీస సదుపాయాలకు దూరంగా ఉండే పాతనగరం చరిత్ర ముందు ఎలా ఉన్నా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మారుతూ వచ్చింది. నాలుగేళ్ల పాలన కాలంలో ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి తీసుకున్న అనేక నిర్ణయాల వల్ల ఈ ప్రాంతం దినదినాభివృద్ధి చెందుతోంది. గతంలో ఇక్కడ చాలా చోట్ల మంచినీళ్ల పైపులైన్లు మురుగు కాల్వల మీదుగా ఏర్పాటై ఉండేవి. దాంతో ఎక్కడైనా పైప్‌లైన్ లీకైతే మురుగు పైపుల్లోని నీటితో చేరి కలుషిత జలమే స్థానికులు తాగాల్సి వచ్చేది. సీఎం జగన్ ప్రభుత్వం ఇక్కడ కనీస మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇచ్చి నూతనంగా పైప్‌లైన్లు, రోడ్లు, డ్రెయిన్లు, నాడు-నేడు పథకంలో భాగంగా కొత్త పాఠశాలల ఏర్పాటు, ముస్లింలకు కల్యాణ మండపం, మత్స్యకారుల ఉపయుక్తం కోసం భవన నిర్మాణం చేసింది. దీంతో పూర్వమెప్పుడో టౌన్‌గా పిలవబడిన ఈ ప్రాంతం మళ్లీ ఆనాటి వైభవం వైపు అడుగులు వేస్తోంది.

సచివాలయాల ఏర్పాటుతో ప్రగతి

ఏ ప్రాంతమైనా సంపూర్ణంగా అభివృద్ధి చెందాలంటే ఎక్కడికక్కడ పర్యవేక్షణ జరగాలని.. సచివాలయాల ఏర్పాటుతో అది సాకారం అవుతుందని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ముందు చూపుతో ఏర్పాటు చేసిన ఈ వ్యవస్థ వల్ల ఈ ప్రాంత అభివృద్ధి వేగంగా జరుగుతోంది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమం సవ్యంగా ప్రజలందరికీ అందేలా సచివాలయ వలంటీర్లు, కార్యదర్శులు కృషి చేయడంతో పాతనగరంలో అభివృద్ధి స్పష్టంగా కనిపిస్తోంది. ఇక్కడి ప్రజలంతా ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమంతో సంతృప్తిగా జీవనం సాగిస్తున్నారు.

జగనన్న పథకాలతో అభివృద్ధిపథాన..



గత ప్రభుత్వాల నాయకులు కనీస సౌకర్యాలు కల్పించడంలో విఫలమయ్యారు. దీంతో పాతనగరంలో పెద్దగా అభివృద్ధి జరగలేదు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలతో పాతనగరం అభివృద్ధి వైపు దూసుకుపోతోంది. రూ. 20 లక్షల సచివాలయ అభివృద్ధి నిధులతో వార్డులో కమ్యూనిటీ భవనాలు, కాలువలు, సీసీరోడ్లు, కల్వర్టులు, యూజీడీల మరమ్మతులు జరుగుతూ ఈ ప్రాంతం వడివడిగా అభివృద్ధి వైపు అడుగులు వేస్తోంది.

–మహ్మద్ సాధిక్, 39వ వార్డు వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్

సిరులతల్లికి సహస్ర తులసిపూజ


సహస్ర తులసి పూజలో సిరులతల్లి

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అలాగే పంచామృతాభిషేక సేవ, శ్రీచక్రానవవర్ణార్చన లక్ష్మీహోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పై ప్రత్యేక పూజలో పరోక్ష పద్ధతిలో పాల్గొనే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో తిరుమలేశ్వరరావు, ఆలయ పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు క్షీరాభిషేక సేవ..

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

సీఏ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్‌కు ఆలిండియా ర్యాంకులు

డాబాగార్డెన్స్: ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా ప్రకటించిన సీఏ ఇంటర్, సీఏ ఫైనల్ ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ విద్యార్థులు ఆలిండియా ర్యాంకులు సాధించారని మాస్టర్‌మైండ్స్ విద్యాసంస్థల అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ తెలిపారు. ఆలిండియా స్థాయిల్లో సీఏ ఫైనల్ ఫలితాల్లో జి.భార్గవి 11వ ర్యాంకు, పి.కుమార్ 32వ ర్యాంకు, పి.రాజేష్ 34వ ర్యాంకు సాధించారని, సీఏ ఇంటర్ ఫలితాల్లో ఆలిండియా స్థాయిలో వి.హేమంత్ 19, జి.పవన్‌నాగసాయి 29, పి. చరణ్ ధనుష్ 37వ ర్యాంకు సాధించారని తెలిపారు. సీఏ ఇంటర్, సీఏ ఫైనల్‌లో మాస్టర్‌మైండ్స్ నుంచి ఒక గ్రూపు కాని, రెండు గ్రూపులు కాని పాస్ అయిన వాళ్లు సుమారుగా 1800 నుంచి 2 వేల మంది విద్యార్థుల వరకు ఉన్నారని మోహన్ తెలిపారు.

సీపీఇ సీఏ అకాడమీలో ఉత్తమ ఫలితాలు

ఐసీఏఐ ఫలితాల్లో సీపీఇ సీఏ అకాడమీ ప్రతిభ సాధించిందని అకాడమీ సీఈవో ఆదినారాయణ తెలిపారు. ఈ మేరకు గురువారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఐసీఏఐ ఫలితాల్లో అకాడమీ సాధించిన ఫలితాలు వివరించారు. సీపీఇ సీఏ అకాడమీలో ఇంటర్మీడియట్ ఎంఈసీతో పాటు సీఏ చదువుతున్న ఎస్ మణి సహస్ర ఆలిండియా స్థాయిలో 36వ ర్యాంకు సాధించిందని, అలాగే సీఏ ఫైనల్ ఫలితాల్లో కోట్ల తరుణ్‌కుమార్ ఉత్తీర్ణుడయ్యారని తెలిపారు. 18 మంది రెండు గ్రూపులు, 16 మంది ఒక గ్రూపులో ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. సమావేశంలో డైరెక్టర్స్ సీఏ సుధీర్, సీఏ రామచంద్రం, ప్రిన్సిపాల్ పీఎస్‌వీ ప్రసాద్, ర్యాంకు సాధించిన విద్యార్థులు పాల్గొన్నారు.

పెంపుడు జంతువుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

- మేయర్ గొలగాని హరివెంకటకుమారి
- ఘనంగా ప్రపంచ జునోసిస్ దినోత్సవం


మేయర్ హరివెంకటకుమారి సమక్షంలో కుక్కకు టీకా వేస్తున్న జేడీ డాక్టర్ రామకృష్ణ

ఆరిలోవ: పెంపుడు జంతువుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరమని మేయర్ గొలగాని హరివెంకటకుమారి సూచించారు. తోటగరువు పశు వైద్యశాలలో గురువారం ప్రపంచ జునోసిస్ దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పెంపుడు కుక్కల యజమానులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కుక్కలకు ఉచిత ర్యాబిస్ వ్యాక్సిన్ వేశారు. ముఖ్యఅతిథిగా మేయర్ మాట్లాడుతూ మనుషులతో పాటు మూగ జీవాల ఆరోగ్యం కోసం కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. పశువుల కోసం ప్రత్యేకంగా 1962 అంబులెన్స్ అందుబాటులోకి తీసుకొచ్చారన్నారు. దీంతో ప్రమాదానికి గురైన పశువులు, అనారోగ్యానికి గురైన పశువుల వద్దకు వెళ్లి తక్షణ వైద్య సేవలు అందుతున్నాయన్నారు. అనంతరం పశు సంవర్ధక శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ జునోసిస్ దినోత్సవం సందర్భంగా పెంపుడు కుక్కలకు ఉచితంగా ర్యాబిస్ వ్యాక్సిన్ వేస్తున్నామన్నారు. గురువారం తోటగరువు పశు వైద్యశాలలో 476 కుక్కలకు వ్యాక్సిన్ వేసినట్లు తెలిపారు. సంవత్సరానికి ఒకసారి తప్పనిసరిగా కుక్కలకు ర్యాబిస్ వ్యాక్సిన్ వేయించాలని సూచించారు. లేదంటే ర్యాబిస్ వ్యాధి సోకే ప్రమాదముందన్నారు. ర్యాబిస్ సోకిన పిచ్చి కుక్క కరిస్తే మనిషికి ప్రాణాంతకమన్నారు. జిల్లాలో 20 వేల ర్యాబిస్ వ్యాక్సిన్ డోసులు సిద్ధంగా ఉన్నాయని ఆయన చెప్పారు. పెంపుడు శునకాల యజమానులు వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. అనంతరం మేయర్ సమక్షంలో కుక్కలకు వ్యాక్సిన్ వేసి, వాటికి అవసరమైన ఆహారం ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో డీడీలు డాక్టర్ ఎన్.చంద్రశేఖర్, డాక్టర్ దేవులపల్లి శంకరరావు, డాక్టర్ బి.రామ్మోహనరావు, ఏడీలు డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, డాక్టర్ మదీనాప్రసాద్, డాక్టర్ ఎల్.కన్నయ్యనాయుడు, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

9న ఉచిత దంత వైద్య శిబిరం

డాబాగార్డెన్స్: అసోసియేషన్ ఆఫ్ అలయెన్స్ క్లబ్ విశాఖపట్నం నార్త్‌క్లబ్, బాల వికాస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 9న ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆయా సంఘాల ప్రతినిధులు కె.సత్యనారాయణ, నరవ ప్రకాశరావు పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు ఫిషింగ్‌హార్బర్ రోడ్డు సిఫ్‌నెట్ హాస్టల్ పక్కన గల బాల వికాస్ ఫౌండేషన్ బ్రిడ్జి స్కూల్లో నిర్వహించనున్న ఉచిత దంత వైద్య శిబిరంలో స్థానికులు పాల్గొనాలని కోరారు.

గర్భిణులు వైద్య సలహాలు తీసుకోవాలి


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట : గర్భిణులకు వైద్యుల సలహాలతోపాటు మ్యాపింగ్ త్వరితగతిని పూర్తి చేయాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. గురువారం ప్రసాద్ గార్డెన్స్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం అక్కడ వైద్యులు, సిబ్బందితో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. క్షేత్ర స్థాయి సిబ్బంది సందర్శనకు వెళ్లిన సమయంలో మూవ్‌మెంటు రిజిస్టర్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు. యూపీహెచ్‌సీలో ఫార్మసీ స్టాక్ రిజిస్ట్రార్, వ్యాధి నిరోధక టీకాల రిజిస్టర్‌ను క్షుణంగా పరిశీలించి పలు సూచనలు చేశారు. పట్టణ ఆరోగ్య కేంద్రంలో యాంటి సీరం వ్యాక్సిన్ అందుబాటులో లేకపోవడంతో తక్షణమే డిస్ట్రిక్ట్ స్టోర్స్ నుంచి రప్పించుకోవాలని ఆదేశించారు. సూపర్‌వైజర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు బిల్ జంక్షన్ హాలులో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో నోడల్ అధికారి డాక్టర్ ఎన్.రమా రెడ్డి, పట్టణ ఆరోగ్య కేంద్ర సిబ్బంది, వైద్యులు పాల్గొన్నారు.

మత్తు ఇంజక్షన్లు విక్రయిస్తున్న ముగ్గురి అరెస్టు

మద్రిపాలెం: మత్తు ఇంజక్షన్లు విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కంచరపాలెం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మత్తు ఇంజక్షన్లు విక్రయిస్తున్నారని సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్, కంచరపాలెం పోలీసులు సంయుక్తంగా గురువారం దాడులు నిర్వహించారు. ఊర్వశి జంక్షన్ దరి బర్మాక్యాంప్ వద్ద ఓ మెడికల్ షాపులో తనిఖీలు చేయగా పెంటాజోసిన్, లేక్టేట్ (1ఎంఎల్) 850 ఇంజెక్షన్లు లభ్యమయ్యాయి. షాపు యజమాని గెద్దం కళ్యాణ్, ప్రసాద్, పెదపూడి రాంప్రసాద్ కలిసి ఈ ఇంజక్షన్లను విక్రయిస్తున్నట్టు తేలింది. వారిని అదుపులోకి తీసుకుని మత్తు ఇంజక్షన్లు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'జగనన్న సురక్ష' తో ముంగిటకే ప్రభుత్వ సేవలు


జగనన్న సురక్ష పథకం గురించి వివరిస్తున్న రంధి గోపి

అల్లిపురం: జగనన్న సురక్షతో ప్రభుత్వ సేవలు ప్రజల ముంగిటకే వస్తున్నాయని 33వ వార్డు అధ్యక్షుడు రంధి గోపికృష్ణ అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఆయన వార్డు పరిధి గౌరీవీధి సచివాలయం పరిధి, వెంకటేశ్వరమెట్ట–1 సచివాలయం పరిధిలో వార్డు కన్వీనర్లు, వలంటీర్లతో కలసి ఇంటింటికి వెళ్లి జగనన్న సురక్ష పథకం వివరాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ అని అన్నారు. ప్రజలకు పలు రకాల ధ్రువీకరణ పత్రాలు వలంటీర్ సహకారంతో ఉచితంగా పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో పార్టీ పార్లమెంట్ జిల్లా కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్, వార్డు సచివాలయం సెక్రటరీ పీవీ కిరణ్‌కుమార్, జయచంద్ర, జాన్‌బాబు, కన్వీనర్ శ్రీను, షాహిద్, రాజు తదితరులు పాల్గొన్నారు.

వేతన ఒప్పందం అమలు చేయాలి



మాట్లాడుతున్న ఆర్‌కేఎస్‌వీ కుమార్

డాబాగార్డెన్స్ : గంగవరం (ఆదాని)పోర్టు కార్మికులకు తక్షణమే వేజ్ అగ్రిమెంట్ చేయాలని సిటూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం సిటూ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గంగవరం పోర్టు నిర్మాణంలో నిర్వాసితులు తమ ఇళ్లు, భూములను త్యాగాలు చేశారని, వారికి పర్మినెంట్ ఉద్యోగులకిచ్చే వేతనాలు ఇస్తామని చెప్పి, ప్రస్తుతం అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. కలెక్టర్ ఇటీవల కాలంలో రెండు సార్లు చర్చలు జరిపారని, కలెక్టర్ సూచనలు కూడా అమలు చేయకుండా యాజమాన్యం మొండిగా వ్యవహరించడం సరైనది కాదన్నారు. ఇప్పటికైనా వేతన ఒప్పందం వెంటనే చేయాలని, లేకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. గంగవరం పోర్టు వద్ద పోలీసుల పెత్తనం ఎక్కువైందని, బెదిరింపులు పెరిగాయన్నారు. పోలీసుల జోక్యం వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జ్యోతీశ్వరరావు, బి జగన్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు

- ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్


లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, కార్పొరేటర్లు

డాబాగార్డెన్స్: కులాలు..మతాలు..పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందుతున్నాయంటే అది ఒక్క జగనన్న ప్రభుత్వంలోనేనని విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పేర్కొన్నారు. జీవీఎంసీ 30వ వార్డు తాడివీధి కమ్యూనిటీ హాల్లో ఆరు సచివాలయాలు, 37వ వార్డులో ఏడు సచివాలయాల్లో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుపల్లి ఆయా వార్డుల కార్పొరేటర్లు చెన్నా జానకీరామ్, కోడూరు అప్పలరత్నంతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఎమ్మెల్యే వాసుపల్లి మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకం కింద వలంటీర్లు, గృహసారథులు, సచివాలయ సిబ్బంది ద్వారా ప్రతి ఇంటిని సందర్శించి 1,542 సమస్యలు గుర్తించామన్నారు. వీటిలో 30 శాతం పనులు పూర్తి చేసి నేడు లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశామని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు పూర్తిగా అందేలా చేస్తున్న జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజల్లో జగనన్నపై మరింత నమ్మకం ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే అర్హులైన ప్రతి ఒక్కరికీ మేలు జరిగిందని, ఇంకా అర్హులైన వారు ఎవరైనా లబ్ధి పొందకుండా ఉండకూడదనే ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు చెప్పారు. జగనన్న సురక్ష కార్యక్రమ క్యాంపుల్లో దాదాపు 11 రకాల సర్టిఫికెట్లు ఉచితంగా అందివ్వడం జరిగిందన్నారు. అందులో భాగంగా కుల, ఆదాయ, జనన ధ్రువీకరణ, వివాహం, ఫ్యామిలీ మెంబర్, డెత్, బియ్యం కార్డులు, కుటుంబాల విభజన, సీసీఆర్సీ, మ్యూటేషన్లు, ఫోన్ నంబరుకు ఆధార్ లింకేజీ సర్టిఫికెట్లు ఇలా ఎటువంటి ఫీజు లేకుండా ఉచితంగా అందించే కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకుని జగనన్నకు, వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, 29వ వార్డు అధ్యక్షుడు పీతల వాసు, 30వ వార్డు అధ్యక్షుడు దశమంతుల మాణిక్యాలరావు, రెయ్యి డేవిడ్‌రాజు, పెంటపల్లి సత్యనారాయణ, కోన శంకర్, వద్దాది దిలీప్‌కుమార్, దశమంతుల చిన్ని, ఆనంద్‌కుమార్, వేణు, దేవరాజు, శ్యామ్, జగన్, రాము, కల్యాణి, రామలక్ష్మి, మణి, మీన, కాసారపు వాసు, యేసు, వెంకటలక్ష్మి, శైలజ, రోజా, రమణి, ఆదిలక్ష్మి, ఆనంద్, జోనల్ కమిషనర్ శివప్రసాద్, ఏపీడీ పుణ్యవతి, అధికారులు ఆనంద్‌కుమార్, చేతన్, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

33వ వార్డులో ఎమ్మెల్యే వాసుపల్లి పర్యటన


లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు

అల్లిపురం: జగనన్న సురక్ష వలంటీర్ సర్వే తీరును దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యుడు వాసుపల్లి గణేష్‌కుమార్ క్షేత్రస్థాయి పరిశీలించారు. ఈ మేరకు ఆయన గురువారం 33వ వార్డు పరిధి వెంకటేశ్వరమెట్ట–1 పరిధిలో పర్యటించారు. వార్డు పరిధిలో జగదీష్, సాయి దంపతులకు ఇటీవల ద్విచక్రవాహన ప్రమాదం జరిగి కాలుకు తీవ్ర గాయాలు పాలై జీవనోపాధి కోల్పోయారు. వారి పిల్లల చదువుల కోసం ఫీజులు కట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. అంతేకాకుండా సాయిబాబా వీధిలో జీవనోపాధికి షాప్ పెట్టుకొనగా జీవీఎంసీ అధికారులు తొలగిస్తామని బెదిరిస్తున్నారని వైఎస్సార్‌సీపీ నేతల ద్వారా తెలుసుకున్న వాసుపల్లి స్పందించారు. సంబంధిత జీవీఎంసీ అధికారులతో మాట్లాడి జగదీష్ ఏర్పాటు చేసుకున్న షాపు తొలగించవద్దని కోరారు. తనకు పెన్షన్ ఆగిపోయిందని దొడ్డి నూకరత్నం చెప్పడంతో ఆమె సమస్యను పరిష్కరించాలని అడ్మిన్, సెక్రటరీలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు లింగం శ్రీనువాసరావు, లండా రమణ, బొడ్డేటి ప్రసాద్, వాసుపల్లి నారాయణరావు, దూడ అప్పారావు, ఆడారి మహేష్, శ్రీను, చిన్నమ్మలు, సచివాలయం సిబ్బంది, కన్వీనర్లు, గృహసారథులు తదితరరులు పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్‌కు ఘన నివాళులు


బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న తోట పద్మావతి తదితరులు


జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న నూకాంబికా సంక్షేమ సంఘం

అల్లిపురం: నేటి యువత బాబూ జగ్జీవన్‌రామ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలని 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి అన్నారు. జగ్జీవన్‌రామ్ వర్ధంతి సందర్భంగా గురువారం ఆమె నూకాంబికా అమ్మవారి ఆలయం సమీపంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు లండా రమణ, దూడ అప్పారావు, దేవి ఈశ్వరి, వెంకటేష్, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

నూకాంబికా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..

కొబ్బరితోట, శ్రీ నూకమాంబ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్ రామ్ వర్ధంతి కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు యాణంగి వేణు, అనపర్తి శ్రీను, తెలుగుచర్ల కనకరాజు, రాయి అప్పారావు, రాయి చిన్నా, యాణంగి శివ, చెవ్వేటి అప్పారావులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

యువకుడిని కబళించిన లారీ


ఘటనా స్థలంలో పూతి మహేష్ మృతదేహం, ప్రమాదానికి కారణమైన లారీ

అక్కిరెడ్డిపాలెం: బతుకుదెరువు కోసం నగరానికి వచ్చిన యువకుడిని లారీ రూపంలో మృత్యువు కబళించింది. గాజువాక కణితి రోడ్డు వై జంక్షన్ వద్ద గురువారం జరిగిన ప్రమాదంలో యువకుడు సంఘటన స్థలంలోనే దుర్మరణం చెందాడు. గాజువాక ఎస్ఐ కొల్లి సతీష్ తెలిపిన వివరాలివీ.. పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టంనకు చెందిన పూతి మహేష్(25) స్విగ్గీలో పని చేస్తున్నాడు. మహేష్ గురువారం ద్విచక్ర వాహనంపై గాజువాక కణితి రోడ్డు వై జంక్షన్ వద్దకు రాగానే.. వెనుకనే వస్తున్న లారీ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో అతని తలపై నుంచి లారీ వెళ్లిపోవడంతో.. మహేష్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సమాచారం అందుకున్న ఏసీపీ త్రినాథ్, ఎస్ఐ సతీష్ సంఘటన స్థలానికి చేరుకుని.. ప్రమాదంపై ఆరా తీశారు. వివరాలు సేకరించి ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. లారీని స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు. మహేష్ అవివాహితుడు. అతని తల్లిదండ్రులు వీరఘట్టంలోనే ఉంటున్నారని ఎస్ఐ తెలిపారు.